


మవ్వూరు విజయలక్ష్మి

అబ్బా అన్న అరుపు, ఆ వెంటనే గాజు సామాను పగిలిన చప్పుడు, 'ఓరి వెధవా, పగలగొట్టేశావా, అనుకున్నంతా చేశావు, అయినా నీకు ఒళ్ళు బాగా పొగరెక్కిపోయిందిరా'' అన్న మాటలు వినపడి, ఏమిటా అని గదిలోంచి బయటకొచ్చింది ఉమ.

హాల్లో ఆగ్రహంగా చూస్తున్న లత, భయంగా నిలబడ్డ పదేళ్ళ రాము, మధ్యలో పగిలిపోయిన ఫ్లవర్ వాజ్ కనిపించి సంగతి అర్థమైపోయింది ఉమకు. భయం భయంగా నిలబడ్డ రామును చూస్తే జాలేసింది. అక్కను చూద్దామని రెండు రోజుల క్రితమే వచ్చిన ఉమకు అక్క ప్రవర్తన అనూహ్యంగా వుంది. చీటికీ మాటికీ పనివాళ్ళ మీద కేకలేస్తుంది. వాళ్ళెదురు తిరగడం, గొడవ.

''చూడు ఉమా, బంగారం లాంటి ఫ్లవర్ వాజ్ పగలగొట్టేశాడు'' ఫిర్యాదు చేసింది లత చెల్లెలితో. ఏం చెప్పలేక, ''ముందా గాజు పెంకులెత్తమను. ఎవరికైనా గుచ్చుకోగలవు'' అంది ఉమ.

చెల్లెలు అలాతేల్చేయడం ఆమెకునచ్చలేదు. ''ఏరా, జాగ్రత్తగా చూసుకు తుడవక్కర్లేదా?'' రెట్టించింది.

''జాగ్రత్తగానే తుడిచానమ్మగారూ, టీపాయ్ తుడిచి లేచేసరికి కిటికీ రెక్క నెత్తిమీద తగిలి ముందుకు పడ్డానమ్మా. దాంతో ఫ్లవర్ వాజ్ కిందపడింది. నెత్తి తడుముకుంటూ నెమ్మదిగా చెప్పాడు రాము.

అవును మరి, కళ్ళు నెత్తి మీద పెట్టుకు పని చేస్తే ఏమవుతుంది. హుంకరించింది. ఆ ప్రవాహం అలా సాగిపోయేదే. ఇంతలో పోస్ట్ అన్న కేక వినబడ్డంతో ''ఊ! పెంకులన్నీ ఎత్తి శుభ్రం చెయ్'' అంటూ వీధిలోకొచ్చింది పోస్ట్ కోసం.

అప్పటికే పోస్ట్‌మేన్ ఇచ్చిన కాంప్లిమెంటరీ కాపీ చూసిన ఉమ సంతోషంతో కేక పెట్టింది. అక్కా నీ కథ పడింది అంటూ. ఆనందంగా పుస్తకం అందుకొని చూసుకుంది లత.

అక్క వ్రాసిన కథ చదివి ఆలోచనలో పడింది ఉమ. కథలో పనివాళ్ళ గురించి, వాళ్ళ బాధల గురించి ఎంతో చక్కగా రాసిన అక్క ఇంట్లో ఎందుకిలా ప్రవర్తిస్తుంది. ఆ మాటే అడిగింది కూడా.

''ఆ నాకు తెలీదులే. కథల్లో రాసే ప్రతిదాన్ని ఆచరించాలంటే మనకు కుదురుతుందా? దేని దారి దానిదే'' తేల్చేసింది లత.

''అయితే అక్కా నువ్వు రాసేవన్నీ ఒట్టి మాటలే అన్నమాట'' మనసులోని మాట సూటిగా అడిగేసింది ఉమ.

సమాధానం చెప్పలేకపోయింది లత. ఇంతలో అమ్మా, అమ్మా ఏడుస్తూ వచ్చాడు లత కొడుకు రవి. ''ఏమయిందిరా నాన్నా?'' గాభరాగా అడిగింది లత. మరేమో స్కూలు నుండి వస్తుంటే రాయి తగిలి కింద పడ్డాను. ఏడుస్తూనే చెప్పాడు వాడు. ఆ కంగారుతోనే వాడి గాయం కడిగి మందు వేసి, అన్నం పెట్టి నిద్రపుచ్చింది.

ఆ సాయంత్రం మౌనంగా కూర్చున్న అక్క ప్రక్కన చేరింది ఉమ. ''అక్కా ఉదయం నేనన్న మాటలకు కోపం వచ్చిందా? సారీ అక్కా'' అంది.

''ఛ! నాకేం కోపం లేదు. అయినా నువ్వేం చేశావని నీ మీద కోపం వస్తుంది'' ప్రేమగా చెల్లెల్ని చూస్తూ అంది లత.

''అది కాదక్కా, మరి నువ్వు కథల్లో వర్ణించే విషయాల గురించి, ఆ పాత్రల మంచితనం, సహనం గురించి మా ఫ్రెండ్స్ ఎంత గొప్పగా చెప్పుకుంటారో తెలుసా? నాకయితే చాలా గర్వంగా వుంటుందనుకో, ఇక్కడేమో నేనొచ్చిందగ్గర్నుంచీ నువ్విలా వాడి మీద అరుస్తుంటే చూసేక కోపంతో పోటికొచ్చింది అనేశాను. అంతేగానని నిన్ను హర్ట్ చెయ్యాలని కాదక్కా. నువ్వే ఆలోచించు. రవికి చిన్న గాయమైతే ఎంత గాభరా పడ్డావు. మరి వాడి ఈడు వాడే కదా రాము కూడా, వాడి మీద ఎందుకలా విరుచుకుపడతావు. నేను మరీ అతిగా మాట్లాడి నిన్ను నొప్పిస్తే క్షమించక్కా''

''ఉమా! నీ మీద నాకేం కోపం లేదే. ఎందుకలా బాధపడిపోతావే'' తేలిగ్గా అంది లత. చెల్లెలితో అలా అంది గాని తర్వాత నాలుగు రోజుల వరకు ఆ విషయం ఆలోచిస్తూనే వుంది. తను నిజంగానే తప్పు చేస్తోందా? ఉమ అన్నట్టు కథల్లో తను చెప్పిన విషయాలు తనే ఆచరించకపోతే, ఇక ఆ కథలు రాసెందుకు? ఇలా ఆలోచిస్తూనే వుంది.

ఆ రోజు ఉదయం ఉమ పెరట్లో కెళ్ళేసరికి రాము కాలికి కట్టుకడుతూ కనిపించింది లత. ''ఏంటక్కా, ఏమయింది?'' అడిగింది ఉమ. నీకిమ్మని కప్పుతో కాఫీ పంపించాను వీడి చేత. వాడసలే గాభరా రాయుడు కదా, అది కాస్త కింద పడేశాడు. పైగా ఆ కంగారులో పగిలిపోయిన కప్పు మీద కాలు వెయ్యడంతో అది గుచ్చుకుంది'' సౌమ్యంగా చెప్పింది లత.

కప్పు పగలగొట్టినందుకు ఇల్లెగిరేలా కేక లెయ్యకుండా, వాడి కాలికి కట్టు కట్టడమే కాకుండా ఆ విషయాన్ని అంతే సరళంగా చెప్తున్న అక్కలోని ఈ మార్పును ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది ఉమ.